
సాక్షి ఒడిశా

శనివారం । 6 । జనవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.4,29,666

బంగారం 14 గ్రాముల 400 మిల్లీ గ్రాములు

వెండి 36 గ్రాముల 600 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



చిలికా పక్షుల గణన పూర్తి

చిలికా సరస్సులో తాజాగా చేపట్టిన గణనలో గతేడాది కంటే అధికంగా ఈ ఏడాది పలు రకాల పక్షులు విచ్చేసి బస చేసినట్లు తేలింది.

- 8లో



వింత జంతువు దాడిలో గాయాలు

మల్కన్‌గిరి జిల్లాలోని బోడిగెట్ట పంచాయతీలో ఒక మహిళపై వింత జంతువు దాడి చేయడంతో గాయపడింది.

- 8లో

న్యూస్‌రీల్

నాగుపాము కలకలం



పామును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్

బరంపురం: నగరంలోని సబ్ కలెక్టర్ నివాస ప్రాంగణంలో 7 అడుగుల నాగుపాము శుక్రవారం కలకలం సృష్టించింది. సమాచారంతో బరంపురం అటవీ శాఖ అధికారులు చేరుకొని స్నేక్ హెల్ప్‌లైన్ సంస్థను రప్పించారు. అనంతరం స్నేక్ క్యాచర్ చాకచక్యంతో నాగుపాముని పట్టుకున్నారు. దీంతో బరంపురం సబ్ కలెక్టర్ నివాసంలో ఉన్న ప్రభుత్వ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం లకాడి అటవీ ప్రాంతంలో పామును సురక్షితంగా విడిచిపెట్టారు.

కమల పూజారికి మెరుగైన వైద్యం



ప్రత్యేక అంబులెన్స్‌లో కమల పూజారిని తరలిస్తున్న దృశ్యం

జయపురం: స్థానిక జిల్లాకేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పద్మశ్రీ కమల పూజారిని మెరుగైన వైద్యం కోసం కటక్ తరలించారు. ఆమె వృద్ధాప్య, కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. అందువలన మెరుగైన వైద్య సేవల కోసం కటక్ శ్రీరామ చంద్ర భంజ్ మెడికల్‌కు గురువారం సాయంత్రం ఒక ప్రత్యేక అంబులెన్స్‌లో తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం మెరుగ్గా ఉన్నప్పటికీ మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కటక్ తీసుకు వెళ్లాలని డాక్టర్ మిశ్ర అధికారులకు సూచించారు. అయితే కటక్ వెళ్లేందుకు కమల పూజారి నిరాకరించగా అధికారులు ఆమెకు ఆరోగ్య పరిస్థితి వివరించి నచ్చజెప్పారు.

విజిలెన్స్ వలలో అటవీ శాఖ ఉద్యోగి



పట్టుబడిన బినాయక్ చంద్రసోరి

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా నందాహండి సమితి జగన్నాథపూర్ ఫారెస్ట్ బీట్ గార్డు బినాయక్ చంద్ర సోరి విజిలెన్స్‌కు శుక్రవారం పట్టుబడ్డారు. తన బైక్ మీద ఒక బ్యాగ్‌లో రూ.1,53,000లు తీసుకొని వెళ్తుండగా ఇంద్రావతి సమీపంలోని ఖాతిగుడ వద్ద అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఆ డబ్బు ఎలా వచ్చిందని ప్రశ్నించగా సమాధానం ఇవ్వలేదు. దీంతో జిల్లా కేంద్రంలోని విజిలెన్స్ కార్యాలయానికి తరలించి విచారిస్తున్నారు. నబరంగ్‌పూర్ పట్టణంలో రాజు వీధిలోని అద్దె నివాస భవనంలో సైతం సోదాలు నిర్వహించారు.

యువతి ఆత్మహత్య



ఉరికి వేలాడుతున్న మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి చిత్రంగపల్లి పంచాయతీలో శుక్రవారం ఒక యువతి ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. చిత్రంగపల్లి పంచాయతీ దూర్మాగూడ గ్రామంలో నివాసముంటున్న విమల కవాసి(20) తల్లిదండ్రులు కొన్ని రోజుల క్రితం మృతి చెందారు. దీందో అదే గ్రామంలో ఉంటున్న తన అక్క ఇంట్లో కమల ఉంటోంది. తనకు తల్లిదండ్రులు గుర్తొస్తున్నారని ఎప్పుడూ బాధపడుతూ ఉండేది. ఇదిలా ఉండగా శుక్రవారం ఉదయం గ్రామంలోని వారి పొలం వద్ద చెట్టుకు ఉరికి వేలాడుతూ కనిపించింది. అటుగా వెళ్లిన గ్రామస్తులు కలిమెల పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి మృతదేహన్ని స్వాధీనం చేసుకున్నారు. తల్లిదండ్రులు పోయిన బాధలో ఆత్మహత్య చేసుకొని ఉంటుందని కొందరు చెబుతుండగా, ప్రేమ వ్యవహారం సైతం కారణం కావచ్చనే అనుమానాలు ఉన్నాయి. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహన్ని కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బంద్ ప్రశాంతం

- ఆదివాసీ యువతి హత్యపై నిరసన
- సీబీఐ దర్యాప్తు చేపట్టాలని డిమాండ్
- ఆదివాసీ మహా సంఘం ఆధ్వర్యంలో బంద్



బస్టాండ్‌కే పరిమితమైన బస్సులు



కపిలాస్ కూడలిలో ఆందోళన చేపడుతున్న ఆదివాసీ నాయకులు

రాయగడ: జిల్లాలోని చంద్రపూర్‌లో కాసీపూర్ సమితి లికిటిపాడొరొ గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళ లక్ష్మీ మాఝి (21) హత్య కేసుకు సంబంధించి సీబీఐ దర్యాప్తు చేపట్టాలని జిల్లా ఆదివాసీ మహాసంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం జిల్లావ్యాప్తంగా చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. గతేడాది డిసెంబర్ 21వ తేదీన చంద్రపూర్‌లో అలీసా అనే సంస్థ నిర్వహిస్తున్న మా గృహంలో మేనేజర్‌గా పనిచేస్తున్న లక్ష్మీ అత్యంత దారుణంగా హత్యకు గురయ్యింది. హత్య జరిగి పదిహేను రోజులు గడుస్తున్నా ఇంతవరకు సంబంధిత నిందితులను అరెస్టు చేయలేదు. దీంతో పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని జిల్లా ఆదివాసీ మహా సంఘం జిల్లావ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ క్రమంలో స్థానిక కపిలాస్ కూడలిలో సంఘం జిల్లా అధ్యక్షుడు అప్పల స్వామి కద్రక, కార్యదర్శి జగన్నాథ మండంగి, ఆదివాసీ నాయకుడు బసంత కుమార్ ఉలకల నేతృత్వంలో ఆందోళన చేపట్టారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు బంద్ చేపట్టడంతో వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. కొన్ని ప్రైవేట్ విద్యా సంస్థలకు యాజమాన్యం ముందుగానే సెలవు ప్రకటించాయి. అదేవిధంగా వ్యాపార సంస్థలు మూతపడ్డాయి. ప్రైవేట్ బస్సులు స్థానిక బస్టాండ్ వద్ద నిలిచిపోయాయి. పెట్రోల్ బంక్‌లు కూడా మూసివేశారు. జిల్లాలోని కాసీపూర్, టికిరి ప్రాంతాల్లో బంద్ ప్రభావం అధికంగా కనిపించింది. కాసీపూర్ ప్రాంతానికి చెందిన యువతి కావడంతో ఆ ప్రాంతంలో ఆదివాసీ నాయకులు బంద్‌ను పాటించారు.



లక్ష్మీ మాఝి (ఫైల్)

ప్రభుత్వానివి కంటి తుడుపు చర్యలు

లక్ష్మీ హత్య కేసుకు సంబంధించి సీబీఐ దర్యాప్తు చేపట్టాలని సంఘం అధ్యక్షుడు అప్పల స్వామి కద్రక డిమాండ్ చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పదమూడేళ్ల క్రితం భగీరథి మండంగి అనే యువకుడు, ఐదేళ్ల క్రితం గుణుపూర్‌కు చెందిన ఆదివాసీ యువకుడు పురుషోత్తం గొమాంగో దారుణ హత్యకు గురైనా ప్రభుత్వం ఇంతవరకు నిందితులను అరెస్టు చేయలేదని ఆరోపించారు. క్రైమ్ బ్రాంచ్ ద్వారా నామమాత్రపు దర్యాప్తు ప్రారంభించి, కంటి తుడుపు చర్యలు చేపడుతోందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి త్వరితగతిన నిందితులను పట్టుకోకపోతే ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

బీజేపీ మద్దతు

ఆదివాసీ మహా సంఘం చేపట్టిన జిల్లావ్యాప్త బంద్‌కు జిల్లా బీజేపీ తమ మద్దతు ప్రకటించింది. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్, బీజేపీ ఎస్సీ, ఎస్టీ మోర్చ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు కాశీరాం మాఝిలు కపిలాస్ కూడలికి చేరుకొని ఆందోళకారులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా శివ పట్నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆరోపించారు. ప్రస్తుతం దారుణమైన పాలన కొనసాగుతోందని దుయ్యబట్టారు. కొద్ది సంవత్సరాలుగా ఆదివాసీ మహిళలపై అత్యాచారాలు, యువకులపై హత్యాకాండలు కొనసాగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.



నిర్మానుష్యంగా మారిన రాయగడ ప్రధాన రహదారి



మూసివేసిన వ్యాపార సంస్థలు

ఆకట్టుకున్న శాముఖ సమాధి నాటిక



శాముఖ సమాధి నాటిక ప్రదర్శన

బరంపురం: స్థానిక హిల్‌పట్నా మెయిన్ రోడ్డులోని గంజాం సాంస్కృతిక భవనంలో ఒడిశా నాటక సమరోహ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రదర్శించిన శాముఖ సమాధి నాటిక ఆకట్టుకుంది. 13వ రాష్ట్రస్థాయి నాటక మహోత్సవాల్లో భాగంగా నయగడ్‌కు చెందిన కళాకారులు ఈ నాటికను ప్రదర్శించారు. నేటి రాజకీయాలకు అద్దంపట్టేలా నాటిక ఉంది. అలాగే భువనేశ్వర్‌కు చెందిన 'మూ గ్రామ సహరో' నాటిక ప్రదర్శన సైతం ప్రేక్షకులను అబ్బురపరిచింది. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు అనిల్ కుమార్ పాత్రో, కార్యదర్శి మేహర్ త్రిపాఠి, సహాయ కార్యదర్శి శంకర్షణ్ సబత్, ఉపాధ్యక్షుడు ఉపేంద్ర కుమార్ సాహు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా విడుదల నేడు

భువనేశ్వర్: రాష్ట్రంలో ఓటర్ల తాజా జాబితా శుక్రవారం వెల్లడిస్తారు. తాజా సవరణతో రాష్ట్రంలో సమగ్రంగా 3,32,36,360 ఓటర్లు నమోదైనట్లు సమాచారం. వీరిలో పురుష ఓటర్ల సంఖ్య 1,68,50,949 కాగా, 1,63,82,031 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. థర్డ్ జెండర్ ఓటర్లు 3,380 మంది ఉన్నారు. రాష్ట్రంలో 18 నుంచి 19 సంవత్సరాల వయసు యువ ఓటర్ల సంఖ్య 7,54,946గా నమోదైంది. ఇది గత 5 సంవత్సరాల్లో అత్యధికం కావడం విశేషం. తాజా సవరణలో 2.27 శాతం అధికంగా యువ ఓటర్లు నమోదయ్యారు. 1.38 శాతంతో దివ్యాంగ ఓటర్లు 4,57,821 మంది నమోదయ్యారు. 80 ఏళ్ల పైబడిన సీనియర్ ఓటర్లు 2.06 శాతంతో 6,85,048 మంది ఉన్నారు. 2024 కొత్త ఓటర్ల జాబితాలో మొత్తం 12,97,954 మంది ఓటర్లు చేరారు. వీరిలో 18 నుంచి 19 ఏళ్లలోపు 4,76,969 మంది ఓటర్లను కొత్త జాబితాలో చేర్చారు. శుక్రవారం తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నారు. రాబోయే ఎన్నికల దృష్ట్యా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈవో) అన్ని జాతీయ, రాష్ట్ర గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తుది ఓటరు జాబితా వివరాలు తెలియజేశారు.

18 మండలాల్లో కొత్త కళాశాలలు

భువనేశ్వర్: రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మండలంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. కొత్త విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ కళాశాలలు లేని 18 మండలాల్లో కొత్త కళాశాలలు ఏర్పాటు అవుతాయి. ఈ కళాశాలల్లో ఆర్ట్స్ విభాగంలో విద్యా బోధన ప్రారంభిస్తారు. మండల ప్రధాన కార్యాలయం నుంచి 5 కిలోమీటర్ల పరిధిలో కొత్త +3 డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేస్తారు. వీటి కోసం 10 ఎకరాల విస్తీర్ణపు స్థలం కేటాయించాలని సంబంధిత కలెక్టర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ కమిషనర్ కమ్ సెక్రటరీ అరవింద్ అగర్వాల్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. కళాశాల భవనాల ఏర్పాటు పూర్తయ్యేంత వరకు తాత్కాలిక వసతుల్లో కొత్త డిగ్రీ కళాశాలలు పని చేస్తాయని స్పష్టం చేశారు. +3 డిగ్రీ కళాశాలలు మంజూరైన మండలాలు పరిశీలిస్తే...

జిల్లా	మండలం
గజపతి	గుమ్మా
గంజాం	ధరాకోట్
కలహండి	తుమల్‌రాంపూర్
కంధమల్	ఖొజురిపాడా
కొరాపుట్	బందుగాంవ్
కొరాపుట్	నారాయణపట్న
మల్కన్‌గిరి	చిత్రకొండ
మయూర్‌భంజ్	తిరింగ్
నవరంగపూర్	తెంతులిఖుంటి
నవరంగపూర్	కొసగుముడా
నవరంగపూర్	ఝొరిగాంవ్
నవరంగపూర్	రాయ్‌గడ్
రాయగడ	కాశీపూర్
రాయగడ	రామన్నగూడ
రాయగడ	చంద్రపూర్
సుందరగడ్	నువాగాంవ్
సుందరగడ్	గురుండియా
సుందరగడ్	కువర్‌ముండా

అడవిలో గుర్తు తెలియని మృతదేహం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

జయపురం: బొరిగుమ్మ సమితి దేవులగుడ అడవిలో గుర్తు తెలియని కుళ్లిపోయిన ఒక మృతదేహం శుక్రవారం ఉదయం లభ్యమైంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన కొంతమంది మహిళలు పూలు సేకరించడానికి అడవికి వెళ్లారు. వారు కొండపైకి వెళ్తుండగా అక్కడ ఒక చెట్టు కింద ఒక మృతదేహం కనిపించింది. వెంటనే ఈ విషయం గ్రామస్తులకు తెలియజేయగా వారు బొరిగుమ్మ పోలీసులకు తెలిపారు. ఎస్ఐ రజిత మడకామి, ఏఎస్ఐ బసంత కుమార్ నాగ్, సుభాష్ షాడంగిలు సంఘటన ప్రాంతానికి వచ్చి గ్రామస్తులను విచారించారు. మృతదేహం పక్కన పురుగుల మందు డబ్బా, ఒక వాటర్ బాటిల్ ఉండడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గవర్నర్‌కు బహుమానం



కళలు, సంస్కృతిపై అభిరుచితో పూరీ కుంభారపడా ప్రాంతంలో నివాసముంటున్న శాస్వత రంజన సాహు తాను రూపొందించిన అపురూప కళాఖండాన్ని, గవర్నర్ రఘుబర దాస్‌కు బహుమానంగా శుక్రవారం అందజేశారు. 622 అగ్గి పుల్లలతో తయారు చేసిన శ్రీజగన్నాథ ముఖ ప్రతిరూపాన్ని, గవర్నర్‌కు బహూకరించాడు.

- భువనేశ్వర్

జియో ఫైబర్‌కు జరిమానా



నగరంలో సేవలు అందిస్తున్న జియో ఫైబర్ సంస్థ భారీ జరిమానాకు గురైంది. స్థానిక నయాపల్లి ప్రాంతంలో గోడలపై అనధికారిక పోస్టర్లను అంటించినట్లు భువనేశ్వర్ నగర పాలక సంస్థ(బీఎంసీ) దృష్టికి వచ్చింది. ఈ చర్యపై బీఎంసీ స్పందించి జియో ఫైబర్, నయాపల్లి సంస్థకు రూ.50,000 జరిమానా విధించి ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.

- భువనేశ్వర్

నాటుసారా బట్టీలపై దాడులు



అరెస్టు చేసిన వ్యక్తులు, స్వాధీనం చేసుకున్న సామగ్రి చూపిస్తున్న పోలీసులు

బరంపురం: గంజాం జిల్లాలోని సువాగం ప్రాంతంలో కొద్దిరోజులుగా రహస్యంగా తయారు చేస్తున్న నాటుసారా బట్టీలపై ఎక్సైజ్ అధికారులు దాడులు చేపట్టారు. ఎక్సైజ్ అధికారి ధరణిధర్ ప్రహరాజ్ తెలిపిన వివరాల మేరకు బనియామరి అటవీ ప్రాంతంలో అక్రమంగా తయారు చేస్తున్న నాటుసారా బట్టీపై శుక్రవారం ఉదయం అధికారులు దాడులు చేశారు. దీనిలో భాగంగా 4,200 లీటర్ల విప్ప పువ్వు, నల్ల బెల్లం ఊటను నష్టపరిచారు. మరో 180 లీటర్ల నాటుసార, తయారీ సామగ్రి స్వాధీనం చేసుకొని, నలుగురు నిందితులను అరెస్టు చేశారు.

తమ్ముడిని హత్య చేసిన అన్న



గ్రామంలో దర్యాప్తు చేపడుతున్న పోలీసులు

- పోలీసుస్టేషన్‌లో లొంగుబాటు

జయపురం: తోడబుట్టిన తమ్ముడిని హత్య చేసి స్వచ్ఛందంగా బరిణిపుట్ పోలీసుస్టేషన్‌లో అన్న లొంగిపోయిన ఘటన జయపురం సమితి బరిణపుట్ గ్రామ పంచాయతీ డొంగిరియగుడ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. డొంగిరియగుడ గ్రామానికి చెందిన చెందిన నరసింగ ఖిలో వివాహితుడు. అతడి భార్య ఇల్లు విడిచిపెట్టి ఎటో వెళ్లిపోయింది. దీంతో అతడు తన తమ్ముడు జయసింగ్ ఖిలో(31), ఇద్దరు పిల్లలతో కలిసి గ్రామంలో నివాసముంటున్నాడు. జయసింగ్ ఒక ట్రక్కులో హెల్పర్‌గా పని చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం అతడు ఇంటికి వచ్చాడు. ఆ కుటుంబం జయసింగ్ ఆదాయంపైనే నడుస్తోంది. గురువారం జయసింగ్ తన అన్న కుమారులు ఇద్దరికీ భోజనం చేసేందుకు డబ్బులు ఇచ్చాడు. సాయంత్రం వారు ఇంటిలో తింటున్న సమయంలో నరసింగ ఖిలో వచ్చి, హఠాత్తుగా తమ్ముడు జయసింగ్‌ను గొడ్డలితో నరికాడు. అనంతరం రక్తసిక్తమైన గొడ్డలి, కత్తితో ఇంటి నుంచి బయటకు వచ్చాడు. గొడ్డలి నుంచి రక్తం కారుతుండడంతో వీధిలో చూసినవారు ఖంగుతిన్నారు. ఏదో జరగరానిది జరిగిందని భావించారు. ఒక వ్యక్తి ఇంటి లోపలికి వెళ్లి చూడగా జయసింగ్ ఖిలో రక్తపు మడుగులో పడి ఉన్నాడు. ఈ విషయం అతడు గ్రామస్తులకు తెలిపాడు. అయితే అప్పటికే నరసింగ్ బరణిపుట్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి తన తమ్ముడిని హత్య చేశానని చెబుతూ లొంగిపోయాడు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని ఆయుధాలను సీజ్ చేశారు. పోలీసు అధికారి గణేష్ ప్రసాద్ బెహర, పోలీసుల సాయంతో హంతకుడు నరసింగ్‌ను జయపురం సదర్ పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారు. సదర్ పోలీసుస్టేషన్ అధికారి ఈశ్వర తండి, గగణాపూర్ పోలీసు పంటి అధికారి ఎస్ఐ రాజకిశోర్ బారిక్ తదితరులు సంఘటన చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. అయితే నరసింగ్ తన సొంత తమ్ముడిని ఎందుకు చంపాడనే విషయం తెలియలేదు. దర్యాప్తులో హత్యకు గల కారణాలు తెలియవచ్చని భావిస్తున్నారు.

క్లుప్తంగా

అరుదైన పక్షులు గుర్తింపు



సిములియా ప్రాంతంలో గుర్తించిన పక్షి పిల్లలు

భువనేశ్వర్: బాలాసోర్ జిల్లా సిములియా మండలం కొన్తెయిబిందా పంచాయతీ తీరుఖువా గ్రామంలో అరుదైన పక్షి పిల్లలను గ్రామస్తులు గుర్తించారు. పొలం పనులు చేసుకుంటుండగా వీరి దృష్టికి వచ్చినట్లు తెలిపారు. చిన్న విరిగిన తాటి చెట్టుపై మూడు అరుదైన పక్షులు కనిపించాయి. ఈ విషయం తెలియడంతో పొరుగు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ పక్షులను చూసేందుకు వచ్చారు. తాటి చెట్టుపై గుర్తించిన మూడు పక్షి పిల్లలను స్వేచ్ఛగా విడిచిపెట్టారు. వీటి రూపు రేఖలు గరుడ పక్షిని పోలి ఉన్నాయి.

ఆక్రమణల తొలగింపు



జేసీబీతో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

బరంపురం: నగరంలోని 1వ వార్డులో ఆక్రమణలను బరంపురం అభివృద్ధి సంస్థ, బరంపురం మున్సిపల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం తొలగించారు. ముందస్తు చర్యగా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పోలీసు భద్రత ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక బాధితులు నిరసన తెలపగా, పోలీసుల జోక్యంతో సద్దుమణిగింది. అయితే గత 20 ఏళ్లుగా ఇక్కడే నివసిస్తున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ప్రత్యామ్నాయం చూపించాలని కోరారు.

జేబు దొంగలకు దేహశుద్ధి

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో జేబుదొంగలకు దేహశుద్ధి చేశారు. శుక్రవారం ఉదయానికి మాలధారణ అనంతరం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అరసవల్లి క్షేత్రానికి తరలిరావడంతో ప్రసాదాల కొనుగోలు క్యూలైన్ల వద్ద ఓ నలుగురు భక్తుల జేబుల నుంచి పర్సులు మాయమయ్యాయి. మరొకరి జేబులో పర్సును దొంగిలిస్తూ ఓ జేబుదొంగ దొరికేశాడు. దీంతో ఆ దొంగకు భక్తులు అక్కడే దేహశుద్ధి చేశారు. సుమారుగా ఒక గంటలోనే రూ.12 వేల వరకు చోరీకి గురైనట్లుగా గుర్తించారు. అయితే సీసీ కెమెరాలో ఫుటేజిని చూసిన తర్వాత వీరంతా ఒక గ్యాంగ్‌గా తిరుగుతున్నట్లుగా గుర్తించారు. దొరికిన దొంగకు దేహశుద్ధి చేస్తుండగా.. మరో దొంగ పరారయ్యాడు. వెంటనే స్థానిక హోంగార్డుల సహాయంతో వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించి అతడిని కూడా పట్టుకున్నారు.

దీనిపై ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ వద్ద ప్రస్తావించగా అన్నదాన, ప్రసాదాల కౌంటర్లతో పాటు సాధారణ క్యూలైన్ల వద్ద కూడా బందోబస్తును పెంచేలా పోలీసు అధికారులకు తెలియజేస్తామని వివరించారు. అలాగే ఆలయం తరపున కూడా సెక్యూరిటీ గార్డులను ప్రత్యేకంగా ఆయా విభాగాల్లో నియమిస్తామని ప్రకటించారు.

రిమ్స్ మెస్‌లో విధ్వంసం



రిమ్స్ మెస్‌లో బెంచీలు, కుర్చీలు విరగ్గొట్టి కోడిగుడ్లు పగలగొట్టిన దృశ్యం

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాలలోని పురుషుల మెస్‌లో కొందరు వ్యక్తులు విధ్వంసం సృష్టించారు. కుర్చీలు, బెంచీలు పగలగొట్టి, కొంత వంట సామగ్రిని కూడా ధ్వంసం చేశారు. వందలాది కోడిగుడ్లు పగలగొట్టారు. ఈ ఘటనకు సంబంధించి భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. కొందరు విద్యార్థులు భోజనాన్ని ప్లేట్లలో వేసుకుని హాస్టల్ గదులకు తీసుకువెళ్లడాన్ని, మెస్ ప్రతినిధులు అడ్డుకోవడంతో గొడవ ప్రారంభమైనట్లు సమాచారం. మరికొందరు దీనికి మతం రంగు కూడా పూస్తున్నారు. రిమ్స్ అధికారులు మాత్రం ఇది బయటవారి పనేనని అంటున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా సరైన వివరాలు లేకపోవడంతో వారు ఫిర్యాదు తీసుకునేందుకు నిరాకరించారు. రిమ్స్ అధికారులు ఉదాసీనతతోనే గత పది రోజులుగా రిమ్స్‌లో కొన్ని సంఘటనలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

గంగరాజుపురంలో చైన్ స్నాచింగ్

మెళియాపుట్టి: మండలంలోని గంగరాజుపురం గ్రామానికి చెందిన వట్టికూల్ల రాజేశ్వరి అనే మహిళ మెడలో బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం దొంగిలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాజేశ్వరి గ్రామ పంచాయతీ రహదారి పక్కన ఉన్న జగన్నాథపురం చెరువులో స్నానం చేసుకుని ఇంటికి వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న తులమున్నర పుస్తెలతాడును తెంపుకుని వెళ్లిపోయారు. అతను ఒడిశా జంగాలపాడు వైపు వెళ్లిపోయినట్లు రాజేశ్వరి తెలిపారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

చిలికా పక్షుల గణన పూర్తి

- ఈ ఏడాది 11,37,759 పక్షుల ఆగమనం



చిలికా సరస్సులో పక్షుల సందడి

భువనేశ్వర్: చిలికా సరస్సుకు వలస పక్షుల రాక క్రమేపీ పెరుగుతోంది. తాజాగా చేపట్టిన గణనలో గతేడాది కంటే అధికంగా ఈ ఏడాది పలు రకాల పక్షులు విచ్చేసి బస చేసినట్లు తేలింది. చిలికా సరస్సు భారత ఉపఖండంలో వలస పక్షులకు అతిపెద్ద శీతాకాలపు విడిదిగా వెలుగొందుతోంది. ఈ ఏడాది 187 జాతులకు చెందిన 11,37,759 పక్షులు ఈ సరస్సుకు వలస రావడం విశేషం. సరస్సులో పక్షుల అతిథి పెద్ద శీతాకాలపు విడిదిగా పేరొందిన నొలొబొణొ ద్వీపంలో 3,47,280 అతిథి పక్షులు స్థావరాలు ఏర్పరచుకున్నాయి. గతేడాది సుదూర ప్రాంతాల నుంచి 184 జాతుల 11,31,929 పక్షులు విచ్చేశాయి. నొలొబొణొ ద్వీపానికి 3,42,897 వలస వచ్చాయి. ఈ లెక్కన ఈ ఏడాది పక్షుల ఆగమనం సమగ్ర పెరుగుదల 5,830 నమోదు కాగా, నొలొబొణొ ద్వీపానికి గతేడాది కంటే 4,383 అధిక పక్షులు విచ్చేయడం విశేషం.

పల్లాస్ ఫిష్ డేగ దర్శనం

ఈసారి అగ్రశ్రేణి అపురూప జాతి పక్షుల ఆగమనంతో చిలికా సరస్సు కిలకిలరావాలతో వీనుల కనువిందు చేస్తోందని పర్యాటకుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. తాజా పరిశీలనలో అపురూప జాతి పక్షి ఆగమనం వెలుగు చూసింది. దాదాపు దశాబ్దం తర్వాత పల్లాస్ ఫిష్ డేగ చిలికా సరస్సు తీరంలో తారసపడింది.

ఇతర అగ్రశ్రేణి అతిథి పక్షుల్లో ఉత్తర పిన్‌టైల్ జాతి పక్షులు అత్యధికంగా విచ్చేశాయి. ఈ జాతికి చెందిన 2,18,650 పక్షులు చిలికా సరస్సుకు రావడం విశేషం. 1,56,636 పక్షుల ఆగమనంతో గద్వాల్ జాతి ద్వితీయ అగ్రస్థానంలో నిలిచాయి. యురేషియా విజన్ జాతికి చెందిన 1,40,322 పక్షుల ఆగమనం మూడో స్థానం చేజిక్కించుకున్నాయి.



వలస పక్షుల గణాంకాల విశ్లేషణలో నిపుణులు

‘పగ’మంచు

- మంచు ప్రభావంతో రాలుతున్న మామిడి పూత



దిగపండిలో మంచుతో రంగుమారిన మామిడి పువ్వు



సెరగడాలో నిండుగా పూసిన మామిడి పువ్వు

బరంపురం: గంజాం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో మామిడి పూతకు మంచు తీవ్రనష్టం కలిగిస్తోంది. కొద్ది రోజులుగా రాత్రిపూట దట్టంగా పొగమంచు కురుస్తుండడంతో మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. సెక్లోన్ జోన్‌గా ప్రత్యేక గుర్తింపు పొందిన గంజాం జిల్లాలో గత మూడేళ్లుగా వరుస తుఫాన్‌లతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. అయితే ఈ ఏడాది అయినా మామిడి ఆదుకుంటుందని ఆశిస్తున్న రైతులకు పొగమంచు ప్రభావంతో నష్టాలు తప్పేలా లేవు. మంచు వల్ల మామిడిపూత రాలుతుండడంతో దిగుబడి తగ్గుతుందని వాపోతున్నారు. దిగపండి, సురడా, హింజిలికాట్, సరగడా, ఛత్రపూర్, కళ్లికోట్, చికిటి, రొంగాయిలోండా, కొదళా, జగన్నాథ్‌ప్రసాద్, బంజనగర్ సమితుల పరిధిలో రైతులు మామిడి పంటపై ఆధారపడి జీవిస్తున్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

రాయగడ: జిల్లా బీజేపీ యువమోర్చ నూతన కార్యవర్గం ఏర్పాటయ్యింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. యువమోర్చ జిల్లా అధ్యక్షుడిగా ఉమేష్ ఖోషల, ఉపాధ్యక్షులుగా చిత్త రంజన్ నాయక్, ప్రీతమ్ ఖొర, సందీప్ గుడుల, శ్రీనివాస్ పండలు నియమితులవ్వగా, సాధారణ కార్యదర్శులుగా గౌతం ఉలక, డి.ప్రదీప్, కార్యదర్శులుగా మహేశ్వర్ మంత్రి, కలియా బెహర, పంచానన్ సాహు, రాజేష్ సాహు, సబతా సాబొతో, క్యాషియర్‌గా సొంతును సుబుద్ధి నియమితులైనట్లు వివరించారు. అదేవిధంగా జిల్లా కార్యవర్గ సభ్యులుగా చక్ర నాయక్, అమిన్ మినియాక, గోవర్ధన్ జకక, బబులా బెహర, విభీషన్ గౌడో, ప్రఫుల్ల సాహు, సింధు కులిసిక, సరాబు టక, హరకృష్ణ బెహర, సంజీవ్ కుమార్ లమత, కన్హుచరణ్ బెహర, ప్రఫుల్ల పూజారి, ధరణీ బెహర, సునీల్ బిడిక, జె.రాజు, ప్రశాంత్ సాహుకార్, మధు సబర్, తులియా జొడియా, రాజేంద్ర ఉలక, ఉపేంద్ర మాఝి, ప్రదీప్ మాఝి, సుబ్రత్ పురుషోత్తం, సుశాంత్ హుయికలు నియమితులయ్యారు.

భూతలం.. శీతలం

- రాత్రి వేళ పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- అత్యల్పంగా 14.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- రానున్న రోజుల్లో మరింత చలి తీవ్రత పెరిగే అవకాశం



దట్టంగా కురుస్తున్న పొగమంచు

ఆమదాలవలస రూరల్: జిల్లాపై చలిపులి పంజా విసురుతోంది. గత వారం రోజుల నుంచి ఎలాంటి చలిగాలులు లేవు. ఒక్క రోజులోనే సాధారణ ఉష్ణోగ్రతలు పడిపోవడం వల్ల చలితీవ్రత పెరిగిందని కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ శాఖ విభాగం శాస్త్రవేత్త మౌనిక ‘సాక్షి’కి శుక్రవారం తెలియజేశారు. పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం కాడడంతో సాయంత్రం నాలుగు గంటలు అయితే చాలు బయట తిరగడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉదయం 9 గంటలు దాటినా చలి తీవ్రత తగ్గడం లేదు. చలికి చల్లని గాలులు, మంచు తోడుకావడంతో మరింత అవస్థలు పడాల్సి వస్తోంది. జిల్లాలో సాధారణ ఉష్ణోగ్రతలు చూస్తే రాత్రి వేళ 14 డిగ్రీలు, పగటి పూట 27 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. నాలుగు రోజుల కిందట సాధారణం కంటే రాత్రి ఉష్ణోగ్రతలు నాలుగు డిగ్రీల వరకు అధికంగా రికార్డయ్యేవి. దీంతో చలి తీవ్రత పెద్దగా కనిపించేది కాదు. ప్రస్తుతం పగటి, రాత్రి ఉష్ణోగ్రతల్లో మార్పులు చోటు చేసుకోవడంతో తగ్గుదల కనిపించడం వల్ల చలితీవ్రత పెరిగింది. రోజుకు 4 డిగ్రీలు చొప్పున ఉష్ణోగ్రతలు తగ్గడం వల్ల చలి ఎక్కువగా కనిపిస్తోంది. చలి తీవ్రత వారం రోజులపాటు పెరిగే అవకాశం ఉందని వివరించారు.

చల్లని గాలుల ప్రభావం ఎక్కువ

జిల్లాలో శీతల వాతావరణానికి తోడు గాలుల తీవ్రత ఉండడంతో జనం ఇబ్బంది పడుతున్నారు. చలికి తగ్గట్టుగానే గంటకు 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయడం వల్ల ఉదయం, సాయంత్రం, రాత్రి అన్ని వేళలా చలి బాగా పెరుగుతోంది. దీంతో వాహనాలపై ప్రయాణం చేసే వారికి ఇబ్బందిగా మారుతోంది. గత ఏడాదితో పోల్చి చూసుకుంటే ఈ ఏడాది చలి తీవ్రత ఎక్కువగా ఉంది. గత ఏడాది జనవరి 5వ తేదీన రాత్రి ఉష్ణోగ్రత 17, పగటి ఉష్ణోగ్రత 31 డిగ్రీలు ఉండగా ఈ ఏడాది రాత్రి ఉష్ణోగ్రత 14, పగటి ఉష్ణోగ్రత 27గా నమోదైంది. ఈ ఏడాది జనవరి నెలలో రాత్రి వేళ ఉష్ణోగ్రతలు 14 నుంచి 16 డిగ్రీల మధ్య కొనసాగడం వలన చలి యథావిధిగా కొనసాగుతుంది. సముద్రం వైపు నుంచి గాలులు వీస్తే ఉష్ణోగ్రతల్లో పెరుగుదల వచ్చి చలి తీవ్రత తగ్గుతుందని శాస్త్రవేత్త తెలిపారు. చలి తీవ్రత ఉన్నంతకాలం జిల్లాలో వర్షాలు పడే అవకాశాలు లేవు. దట్టంగా కురుస్తున్న పొగమంచు కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఆస్తమా, గుండెజబ్బు రోగులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

వింత జంతువు దాడిలో గాయాలు



దాడిలో గాయపడిన మహిళ

మల్కన్‌గిరి: జిల్లాలోని బోడిగెట్ట పంచాయతీలో ఒక మహిళపై వింత జంతువు దాడి చేయడంతో గాయపడింది. వివరాల్లోకి వెళ్తే.. రామె మధిరి అనే మహిళ శుక్రవారం ఉదయం తన పుట్టిల్లు కమల పాడ గ్రామానికి వెళ్తున్న సమయంలో ఒక వింత జంతువు ఆమెపై దాడి చేసింది. దీంతో ఆమె కేకలు వేయగా చుట్టుపక్కల ప్రజలు రావడంతో జంతువు పారిపోయింది. వెంటనే స్థానికులు గాయపడిన ఆమెను కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే గాయాలు తీవ్రంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆమెకు చికిత్స అందజేస్తున్నారు. గతంలో ఎప్పుడూ అలాంటి జంతువును చూడలేదని ఆమె తెలియజేశారు. ఇటీవల వింత జంతువు దాడిలో పలు మేకలు సైతం మృతి చెందిన విషయం తెలిసిందే. కానీ ఆ వింత జంతువును ఇప్పటివరకు అటవీ శాఖ అధికారులు సైతం పట్టుకోలేకపోతున్నారు.

రేషన్ బియ్యం పక్కదారి



అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం బస్తాలు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి మోటు పరిధిలో ఉన్నటువంటి మహరాజ్‌పల్లి పంచాయతీ ఎంపీవీ 81 గ్రామంలో రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. రేషన్ కార్డులకు ఇవ్వాల్సిన బియ్యాన్ని కొంతమంది వ్యాపారులు ఒక ఇంటిలో ఉంచి ప్రైవేటుగా అమ్ముతున్నారు. కాగా ఈ బియ్యం వ్యాపారస్తులకు పెద్ద మొత్తంలో ఎలా వెళ్తున్నాయి అనేది తెలియడం లేదు. దీనిపై కలిమెల పౌర సరఫరాల అధికారి కె.గౌమాంగోను ప్రశ్నించగా ఆయన పెదవి విప్పడం లేదు. దీంతో అధికారులు, వ్యాపారస్తులకు మధ్య లోపాయకారి సంబంధాలు ఉన్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

పారిశుద్ధ్య కార్మికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ పట్టణం మెయిన్ రోడ్డులో ఉన్నటువంటి మున్సిపల్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. పారిశుద్ధ్య కార్మికులు చెత్తను తీసుకొచ్చి కార్యాలయం ముందువేసి ఆందోళన చేపట్టారు. తమకు తగిన వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నబరంగ్‌పూర్ మున్సిపాలిటీలో కార్మికులకు గ్లూకోజ్, గ్లౌజ్‌లు, సబ్బులు తదితర సామగ్రి ఇస్తున్నారని, కానీ ఉమ్మర్‌కోట్‌లో ఇవ్వడం లేదన్నారు. ఈపీఎఫ్ డబ్బుల్లో సైతం కోత విధిస్తున్నారన్నారు. తమ డిమాండ్లు నెరవేర్చేవరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు.

113 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ



పట్టాలు అందుకున్న లబ్ధిదారులతో అధికారులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్ సమితి ఖండవ గ్రామంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ మేళాలో భాగంగా 113 మందికి ఎఫ్ఆర్‌పి, గ్రామకంఠం పట్టాలను కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ అందజేశారు. అలాగే గ్రామంలో అమొ ఒడిశా-నవీన్ ఒడిశా పథకంలో భాగంగా రూ.5 లక్షలతో గొడ వీధిలో కల్యాణ మండపం, అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో అదనపు క్లాస్ రూమ్‌లు, మరుగుదొడ్లు ఇతర అభివృద్ధి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో కాశీనగర్ సమితి అధ్యక్షురాలు బల్ల శాయమ్మ, వైస్ చైర్‌పర్సన్ ఎస్.కల్యాణి, బీజేడీ బ్లాక్ అధ్యక్షుడు రొక్కం సతీష్, బీడీవో కపిలేశ్వర తండి పాల్గొన్నారు.

పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించాలి

జయపురం:

ప్రాథమిక పాఠశాలలే విద్యా ప్రగతికి పునాదులని, పిల్లలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. మున్సిపాలిటీ పరిధి పూర్ణఘడ్ ప్రాథమిక పాఠశాలలో అదనపు భవనాలకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు చిన్నారులకు గుణాత్మక విద్యనందించాలని సూచించారు. మున్సిపల్ కార్య నిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్ మాట్లాడుతూ పూర్ణఘడ్ ప్రాథమిక పాఠశాలలో 121 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలియజేశారు. వారికి పూర్ణఘడ్‌లోని హనుమాన్ మందిరం పక్కనున్న చిన్న గదిలో పాఠశాల నడుపుతున్నారన్నారు. అందువలన స్థానికులు ఒక నూతన పాఠశాల ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే, మున్సిపాలిటీకి విజ్ఞప్తి చేయగా తాము ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీంతో నల్కో ప్రత్యేక స్వతంత్ర నిధుల నుంచి రూ.5.73 లక్షలను పాఠశాల నూతన భవనాల నిర్మాణానికి మంజూరు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా జయపురం మున్సిపాలిటీ అధ్యక్షుడు నరేంద్రకుమార్ హమంతి, కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్, జయపురం బ్లాక్ ఎడ్యుకేషన్ అధికారి చందన నాయక్, వార్డు కౌన్సిలర్ ధనిమా హరిజన్, హెచ్ఎం సుజాత పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

12న ఉత్తరాంధ్ర స్థాయి క్విజ్ పోటీలు

కంచిలి: మండలంలోని పెద్దకొజ్జిరియా గ్రామంలో ఈ నెల 12వ తేదీన స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఉత్తరాంధ్ర స్థాయి క్విజ్ పోటీలను నిర్వహించనున్నట్లు స్థానిక వివేకానంద యువజన సంఘం వారు తెలిపారు. ప్రతి టీమ్‌లో నలుగురు సభ్యులు ఉండాలని, వయసుతో నిమిత్తం లేదని, భోజన సదుపాయం ఉందని, ప్రవేశ రుసుం లేదని, తుది నిర్ణయం న్యాయ నిర్ణేతలదేనని స్పష్టం చేశారు. ఉదయం 10 గంటలకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ పోటీలు జరుగుతాయని, 50 మార్కులతో స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుందని, దీనిలో టాప్ 10 టీమ్స్ మెయిన్‌లో పాల్గొంటాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు 9010303454, 9010902091, 9866581937 నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

వస్తువుల్లో కళ.. విక్రయాలు భళా



మందస మండలం జగన్నాథ స్వామి స్వయం శక్తి సంఘం ఏర్పాటుచేసిన చెక్క బొమ్మలు

జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన డ్వాక్రా బజార్‌కు సందర్శకుల రాక పెరుగుతోంది. వస్త్రాలు, బొమ్మలు, పచ్చళ్లు వంటివి ఆకర్షిస్తుండడంతో నగర వాసులు వాటిని కొనుగోలుచేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం



లావేరు మండలం ఉదయభాను స్వయం శక్తి సంఘం వారు తయారుచేసిన జూట్ ఉత్పత్తులు



కోనసీమ జిల్లా ఆత్రేయపురం పూతరేకులు, మ్యాంగో జెల్లి



మన్యం పార్వతీపురం జిల్లా సీతంపేటకు చెందిన వారు ఏర్పాటు చేసిన న్యాచురల్ ఆర్గానిక్ ప్రొడక్ట్స్ ఉత్పత్తులు



విజయనగరం జిల్లా చీపురుపల్లికి చెందిన శ్రీ గాయత్రీ స్వయం శక్తి సంఘం వారు ఏర్పాటు చేసిన కొబ్బరి పాలు, కొబ్బరి నీళ్లు, కోల్డ్ ఫిష్ ఆయిల్స్

క్లుప్తంగా

ఇంజినీరింగ్ అసిస్టెంట్‌పై సస్పెన్షన్ వేటు

రామభద్రపురం: రామభద్రపురం సచివాయలయం-2కు చెందిన ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఎస్ సతీష్‌పై సస్పెన్షన్ విధిస్తూ కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. సతీష్‌ను పోలింగ్ స్టేషన్ నంబర్ 120లో బీఎల్‌వోగా తహసీల్దార్ నియమించగా విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఎ సులోచనరాణి ఆర్డీఓకు నివేదిక పంపించారు. ఈ మేరకు ఆర్డీవో సాయిశ్రీ విచారణ చేసి విధులు సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించినా ఇంజినీరింగ్ అసిస్టెంట్ ససేమిరా అనడంతో ఆమె కలెక్టర్‌కు నివేదిక పంపించారు. దీంతో ఎన్నికల నిబంధనల ప్రకారం బీఎల్‌వో (ఇంజినీరింగ్ అసిస్టెంట్)పై కలెక్టర్ సస్పెన్షన్ విధించినట్లు తహసీల్దార్ ఎ.సులోచనరాణి తెలిపారు.

పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి



పోలీస్ సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ శాఖలో సిబ్బందికి ఏర్పడుతున్న సమస్యల పరిష్కారానికి సంబంధించి ప్రతి శుక్రవారం పోలీస్ వెల్ఫేర్ డేను నిర్వహిస్తున్నట్లు ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. ఈ మేరకు పోలీస్ సిబ్బంది సమస్యలను తెలుసుకుని, విన్నపాలు స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. సంబంధిత అధికారులతో చర్చించి, త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.

30మద్యం బాటిల్స్ స్వాధీనం

విజయనగరం క్రైమ్: విజయనగరం రూరల్ పరిధిలోని కోరుకొండ గ్రామ శివారులో అక్రమంగా మద్యం కలిగిన వారిపై రూరల్ సీఐ టివి.తిరుపతిరావు ఆధ్వర్యంలో ఎస్సై గణేష్, సిబ్బంది శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మద్యం బాటిల్స్ కలిగి ఉన్న ఒక వ్యక్తిని అదుపులోకి, 30 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆటో, బైక్ ఢీ: వ్యక్తి మృతి



బంగార్రాజు మృతదేహం

డెంకాడ: మండలంలోని పినతాడివాడ జంక్షన్ సమీపంలో ఆటో, బైక్ ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో విజయనగరం మండలంలోని ధర్మపురి గ్రామానికి చెందిన శీలవలస బంగార్రాజు (35) శుక్రవారం మృతిచెందాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం-నాతవలస ఆర్‌అండ్‌బీ రహదారిపై నాతవలస నుంచి విజయనగరం వెళ్తున్న ఆటో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న బంగార్రాజు తీవ్రంగా గాయపడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు డెంకాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

197 మద్యం బాటిల్స్ పట్టివేత



రాజ్యలక్ష్మీపురంలో మద్యం స్వాధీనం చేసుకున్న కొమరాడ పోలీసులు

కొమరాడ: మండలంలోని రాజ్యలక్ష్మీపురం గ్రామంలో 197 బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నీలకంఠం తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు గ్రామల్లో దాడులు నిర్వహించిన సందర్భంగా ఓ వక్తి అక్రమంగా మద్యం అమ్ముతుండగా స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి కేసు నమోదు చేశామని తెలిపారు. గ్రామల్లో అక్రమంగా మద్యం, సారా తరలించినా..అమ్మినా చట్టపరమైన చర్యలు తీసుకుంటమని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది ఉన్నారు.

మరో 10 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

పాలకొండ: మండలంలోని భాసూరు గ్రామానికి చెందిన జీఎస్.పాండురంగ అక్రమంగా మద్యం అమ్మకాలు చేపడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు ఎస్సై ప్రశాంత్ కుమార్ నేతృత్వంలో శుక్రవారం చేపట్టిన తనిఖీల్లో పది మద్యం బాటిల్స్ పాండురంగ నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. గ్రామాల్లో ఈ తరహా చర్యలకు పాల్పడితే కఠినమైన కేసులు నమోదు చేస్తామని ఎస్సై స్పష్టం చేశారు.

మూగజీవాలకు గడ్డికాలం

- పశుగ్రాసానికి తీవ్రంగా కొరత
- వ్యాన్, ట్రాక్టర్ గడ్డి లోడు రూ.2 వేల పైనే
- వరి పంటలో 70 శాతం యంత్రాలతోనే కోతలు
- అవస్థలు పడుతున్న పాడిరైతులు



వ్యాన్‌లలో ఎండుగడ్డి తరలించడానికి సిద్ధం చేస్తున్న రైతులు

సీతంపేట: వ్యవసాయంలో వరికోత యంత్రాల వినియోగంతో పశుగ్రాసం కొరత తప్పడం లేదు. యంత్రాలతోనే వరినూర్పులు చేయడంతో గ్రామాల్లో పశువులకు వినియోగించే గడ్డి దొరకడమే గగనంగా మారింది. గతంలో రైతులు తమ పశువులకు సరిపడా ఎండుగడ్డి నిల్వ చేసుకుని మిగిలిన ఎండుగడ్డిని పొలంలోనే చల్లి దమ్ముచేసేవారు. అయితే యంత్రాలతో కోతలు ప్రారంభమవడంతో ఎండుగడ్డికి కొరత ఏర్పడింది. దీంతో ఎండుగడ్డి బంగారమైంది. గతంలో ఉచితంగా దొరికే ఎండుగడ్డి ఇప్పుడు ఖరీదైన వస్తువుగా మారింది. ఎక్కడో చేతి ద్వారా వరిని కోస్తే ఆ గడ్డికి డిమాండ్ ఉంది. ఒక వ్యాన్, ట్రాక్టర్‌లోడ్ ఎండుగడ్డి రూ.2 వేల వరకు పలుకుతోంది. స్థానికంగా రైతులు సైతం తమ పశువులకు సరిపడా గడ్డి సేకరించడానికి నానా పాట్లు పడుతున్నారు. ఎండుగడ్డికి గిరాకీ పెరగడంతో పలువురు ట్రాక్టర్ యజమానులు, స్థానిక రైతుల వద్ద ఎండుగడ్డి కొనుగోలు చేసి మైదాన ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

పార్వతీపురం మన్యం జిల్లాలో 3.5 లక్షల హెక్టార్లలో ఖరీఫ్‌లో వరి సాగవుతోంది. దీనిలో 70 శాతం వరకు ఆధునిక పద్ధతులైన వరికోత, నూర్పు యంత్రాల ద్వారా ధాన్యం దిగుబడి చేస్తారు. దీంతో గడ్డి ముక్కలవుతుంది. పశువులు వీటిని తినక పోవడంతో పశుపోషణ చేస్తున్న రైతులు యంత్రాలతో కోసిన గడ్డి ముక్కలుగా, రద్దుగా పొలం అంతటా విసిరేసినట్టు చెల్లాచెదురుగా పడుతోంది. ఈ గడ్డిని పోగుచేయడానికి కూలీలకు వేతనాలు చెల్లించాల్సి ఉంటుంది. కొంతమంది రైతులు తప్పని సరి పరిస్థితుల్లో తమ పశువుల మేతకోసం యంత్రాలు కోసిన గడ్డినే కొనుగోలు చేస్తున్నారు. గతంలో యంత్రాలతో కోసిన గడ్డి ఎందుకూ పనికిరాకుండా పొలంలోనే చల్లి తగలబెట్టడమో, నీటి తడి పెట్టి కుళ్లబెట్టి భూమిలో కలియదున్నడమో చేసేవారు. రానురాను వరికోతలో యంత్రాల వినియోగం పెరిగిపోవడంతో యంత్రాలు కోసిన గడ్డి నలిగి రద్దుగా ఉన్నప్పటికీ వేరే ప్రత్యామ్నాయం లేక ఆ గడ్డినే పశుగ్రాసంగా వినియోగిస్తున్నారు.

ఫోర్టిపై చేసుకుంటే పశువులకు పోషకాహారం



యంత్రంతో కోసిన గడ్డిని ఫోర్టిపై చేసుకుంటే పశువులకు తగిన పోషకాహారం అందుతుంది. 4శాతం యూరియా ద్రావణం గడ్డిపైన చల్లి వారం రోజుల పాటు గాలి తగలని ప్రదేశంలో పెడితే బాగుంటుంది. యూరియా గడ్డిలో ఇంకడం వల్ల గడ్డికి బలం వస్తుంది. దీన్ని తిన్నపశువులు కూడా ఆరోగ్యంగా ఉంటాయి.

– శ్రీనివాసరావు, ఎ.డి., పశుసంవర్ధక శాఖ, సీతంపేట

ఎండుగడ్డి సేకరణ కష్టమే



యంత్రాలతో కోయడం వల్ల పశువులకు ఆహారం కష్టమవుతోంది. కొంత మంది గడ్డిని సేకరించి పశువులకు వినియోగిస్తున్నారు. పంటలు పండినా గడ్డికి కొరత తప్పడం లేదు.

– ఎస్.బాపయ్య, జగ్గడుగూడ

కోసిన గడ్డికి డిమాండ్



కోసిన గడ్డికి ప్రస్తుతం మంచి డిమాండ్ ఉంది. గతంలో గడ్డిని ఉచితంగా అడిగే వాళ్లకు ఇచ్చే వాళ్లం. ఇప్పుడా పరిస్థితి లేదు. ఎందుకంటే గడ్డికోసం మైదాన ప్రాంతాలకు చెందిన వారు వస్తున్నారు. వారికి విక్రయిస్తున్నారు. యంత్రాలతో కోసిన గడ్డిని నిరాకరిస్తున్నారు. అక్కడక్కడా మనుషులు కోసిన గడ్డిని సేకరిస్తున్నారు.

– ఎస్.మోజేషు, లంబగూడ

ప్రజల్లో చైతన్యం కలిగించడమే లక్ష్యం



బాడంగిలో బైక్‌ర్యాలీగావచ్చిన సన్యాశిరావును అభినందిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీపీ తదితరనాయకులు

బాడంగి: శ్రీకాకుళం నుంచి కడపజిల్లా ఇడుపులపాయవరకు సుదీర్ఘ బైక్‌ర్యాలీ చేసి ప్రజల్లో వైఎస్సార్ సీపీ పట్ల చైతన్యం కలిగించడమే ప్రధాన లక్ష్యమని బైక్‌ర్యాలీ చేపట్టిన యువకుడు గొర్లెసన్యాశిరావు చెప్పాడు. బైక్‌ర్యాలీ చేసుకుంటూ బొబ్బిలి మండలపరిషత్ కార్యాలయం ఆవరణలో దర్శనమిచ్చిన ఆయనను వైఎస్సార్‌సీపీ నాయకులు అభిమానంతో పలకరించారు. ఈ సందర్భంగా సాక్షి అక్కడికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకునే ప్రయత్నం చేసింది. ఆయనది శ్రీకాకుళం జిల్లా అంపోలు గ్రామం. జగనన్న అంటే ప్రాణమని, ఆయనకోసం బైక్‌ర్యాలీ చేపట్టి పార్టీకోసం ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపాడు. ఇప్పటికే శ్రీకాకుళం జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో బైక్‌ర్యాలీ పూర్తిచేసుకుని విజయనగరం జిల్లాకు చేరినట్లు చెప్పాడు. తొలుత కురుపాం, పార్వతీపురం నియోజక వర్గాల్లో పర్యటించి బొబ్బిలి నియోజకవర్గానికి వచ్చానని ఇక్కడ ఎమ్మెల్యే శంబంగిని కలవడానికి వచ్చినట్లు చెప్పాడు. బైక్‌ర్యాలీ చేస్తున్న వ్యక్తివద్దకు ఎమ్మెల్యే శంబంగి వచ్చి వివరాలడిగి ప్రచారం బాగాచేయాలని ప్రోత్సహించారు. ర్యాలీ చేపట్టిన యువకుడు బైక్ చుట్టూ వైఎస్సార్‌సీపీ జెండాలు కట్టుకుని, తనకు అవసరమైన సామగ్రి దాచుకునే ట్రంకుపెట్టెలకు వైఎస్సార్‌సీపీ రంగులు వేసి చూపరుల కళ్లు తనపై పడేలా బైక్‌ను అందంగా రూపొందించాడు.

బేతనాపల్లి వద్ద నగర వనం ఏర్పాటు

- సీసీఎఫ్ శ్రీకంఠనాథ్ రెడ్డి



విజయనగర వనాన్ని సందర్శిస్తున్న సీసీఎఫ్ శ్రీకంఠనాథ్ రెడ్డి

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లాలోని డెంకాడ మండలం బేతనాపల్లి గ్రామం వద్ద మరో నగరవనం ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు సీసీఎఫ్ శ్రీకంఠనాథ్ రెడ్డి తెలిపారు. సారిపల్లి సెంట్రల్ నర్సరీలో ఏర్పాటు చేసిన నగరవనాన్ని డీఎఫ్‌వో ఎస్.వెంకటేష్‌తో కలిసి శుక్రవారం ఆయన సందర్శించారు. సందర్శకులకు అందుబాటులోకి తీసుకువచ్చిన సందర్శన క్షేత్రం, చిల్డ్రన్‌పార్కు, వాకింగ్ ట్రాక్ తదితరాలను పరిశీలించారు. కొత్తగా నిర్మించబోయే ముఖద్వారం (ఆర్చ్) గురించి వివరాలను డీఎఫ్‌వోను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అయన మాట్లాడుతూ బేతనాపల్లివద్ద 125 ఎకరాల్లో విజయనగరం వాసులకు అవసరమైన వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్ పార్కు, హిల్ ట్రెకింగ్ తదితరాలను అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న నగరవనాలతో నగర వాసులకు ఆహ్లాదం అందడంతో పాటు అడవుల పట్ల అవగాహన కలుగుతుందని అటవీశాఖ ముఖ్య సంరక్షణ అధికారి (సీసీఎఫ్) ఎస్.శ్రీకంఠనాథ్‌రెడ్డి ఈ సందర్భంగా చెప్పారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ అడవులను నగర వాసులకు చేరువ చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం నగర వనాలను అందుబాటులోకి తీసుకువస్తోందన్నారు. నగరవనంతో ఆహ్లాదంతో పాటు ఆరోగ్యాన్ని అందించడం లక్ష్యమని చెప్పారు. ఎప్పుడూ బిజీగా గడిపే నగర ప్రజలు తీరిక సమయాల్లో రోజంతా గడిపేలా నగరవనాలను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే సారిపల్లి సెంట్రల్ నర్సరీలో నగరవనం అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు బొత్స అప్పలరాజు, ఆర్ రాజాబాబు, పి.త్రినాథరావు, రాజు, ఆంజనేయరాజు, డీఆర్‌ఓ ప్రహ్లాదరావు, ఎఫ్ఎస్ఓ కేవీఎస్ రాజు, ప్రహ్లాదరావు, ఎఫ్‌బీఓ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టీసీ ఈడీ కార్యాలయం ముట్టడి

విజయనగరం అర్బన్: ఆర్టీసీ కార్మికులపై జోన్ పరిధి అధికారులు కక్షసాధింపు చర్యలను మానుకోవాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఆర్టీసీ జిల్లా అధికారుల కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం మూడు నెలలుగా జోన్ స్థాయిలో ఉద్యమాలు చేపడుతుంటే ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. 34 రోజుల నుంచి ఈడీ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేస్తున్నప్పటికీ యాజమాన్యం పట్టించుకోకపోవడం వల్ల ముట్టడి కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. ఉద్యోగులకు షెడ్యూల్స్‌ను రద్దు చేసి ఇతర డిపోలకు ట్రాన్స్‌ఫర్ చేయడం అన్యాయమని గతంలో ఉన్న విధంగానే సీహెచ్ సదుపాయం కల్పించాలని కోరారు. ఓటీ డ్యూటీలకు సరిపోయిన డబ్బులు జీతంతోపాటు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి పీవీమోహన్, రాష్ట్ర కార్యదర్శి నరసింగరావు, జోనల్ అధ్యక్ష కార్యదర్శులు ప్రదీప్‌కుమార్, ఎంవీఆర్‌మూర్తి, జిల్లా అధ్యక్షులు పీజీరాఫెల్, బీఎస్‌రాములు, 18 డిపోల నుంచి అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తి దుర్మరణం



సన్యాసినాయుడు మృతదేహం

రామభద్రపురం: మండలకేంద్రంలోని ప్రియాంక ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ సమీపంలో శుక్రవారం సాయంత్రం బైక్ ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. మండలకేంద్రంలోని పూడి వీధికి చెందిన పూడి సన్యాసినాయుడు(58) రామభద్రపురం పూడి వీధి కళ్లాల వద్ద ఉన్న అట్టల ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. పని ముగించుకుని ఇంటికి వస్తున్న సమయంలో మిర్తివలస గ్రామానికి చెందిన కోట లక్ష్మునాయుడు పల్సర్ బైక్‌తో రామభద్రపురం వస్తూ సన్యాసినాయుడిని వెనుక నుంచి బలంగా ఢీ కొట్టాడు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఏఎస్సై చిన్నయ్య కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.


గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ



గర్భిణులకు సంపూర్ణ పౌష్టికాహారం సరుకులు పంపిణీ చేస్తున్న ఐసీడీఎస్ పీడీ ఎం.ఎన్ రాణి

సీతానగరం: గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం లోపనివారణకు చర్యలు చేపడుతున్నామని పార్వతీపురం మన్యం జిల్లా ఐసీడీఎస్ పీడీ ఎం.ఎన్ రాణి అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని చినభోగిలిలో గల రెండు అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పౌష్టికాహారం సరుకులను సీడీపీఓ సుగుణ ఆధ్వర్యంలో పీడీ ఎం.ఎన్ రాణి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకోసం పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో బలిజిపేట సీడీపీఓ సుగుణ మాట్లాడుతూ బలిజిపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో 239 మంది గర్భిణులుండగా ఇంతవరకూ 142 మందికి, బాలింతలు 263 మంది ఉండగా 121 మందికి పౌష్టికాహారం సరుకులు పంపిణీ చేసినట్లు చెప్పారు. వారం రోజుల్లో అందరికీ సరుకులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ పూర్ణిమ, మహిళా పోలీసు పూజ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు 'అభిలాష'



అభిలాష కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: విద్యార్థులు, నిరుద్యోగుల తమ ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు 'అభిలాష' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ పిలుపునిచ్చారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా 53 శాతం అక్షరాస్యతతో బాగా వెనుకబడి ఉందన్నారు. నీతి అయోగ్ నుంచి ప్రత్యేక గ్రాంట్‌గా మంజూరైన రూ.5కోట్లలో రూ.2.30 కోట్లతో 200 సచివాలయాల్లో విద్యార్థులకు అవసరమైన కాంపిటేటివ్, జనరల్ నాలెడ్జ్, సబ్జెక్టు పుస్తకాలతో ఐటీడీఏ ఆధ్వర్యంలో గ్రంథాలయాలను ప్రారంభిస్తామన్నారు. జేఈఈ, నీట్, ఇంజినీరింగ్ ప్రవేశపరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులకు, యూపీపీఎస్సీ, ఏపీపీఎస్‌సీ, రక్షణ దళాలు, ఎస్ఎస్‌సీ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే ఉద్యోగార్థులకు అవసరమైన పుస్తకాలు ఈ లైబ్రరీలో అందుబాటులో ఉంటాయన్నారు. ప్రతీ లైబ్రరీలో 66 పుస్తకాల సెట్లు రెండు ఉంటాయని, విద్యార్థులు వారి పేరు, ఫోన్ నంబర్, ఆధార్ నంబర్ తెలియజేసి 'అభిలాష' గ్రంథాలయాలను ఉపయోగించుకోవచ్చన్నారు. ప్రస్తుతం 97 సచివాలయాల్లో అభిలాష కార్యక్రమం ప్రారంభిస్తామని, దానికోసం రూ.90లక్షలతో 12,804 పుస్తకాలు కొనుగోలు చేసినట్టు వెల్లడించారు. ఈ లైబ్రరీకి వెల్ఫేర్ అసిస్టెంట్ ను బాధ్యులుగా నియమించామన్నారు. పుస్తకాల పంపిణీని ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా నియంత్రిస్తామని చెప్పారు. త్వరలో ఈ కార్య క్రమాన్ని జిల్లా వ్యాప్తంగా అమలుచేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ పాల్గొన్నారు.

ఐదుగురికి సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: కష్టాల్లో ఉన్న వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎల్లప్పుడూ వెన్నుదన్నుగా ఉంటారని ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఈ మేరకు విజయనగరం నియోజకవర్గంలో వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఐదుగురు బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.16.80 లక్షల మొత్తాన్ని శుక్రవారం సాయంత్రం కోలగట్ల వీరభద్రస్వామి అందజేశారు. ఆరోగ్య శ్రీ పరిధిలోకి రాని సమస్యలతో బాధపడుతున్న పేద కుటుంబాలను ఆదుకోవడంలో భాగంగా స్థానిక శాసనసభ్యుడిగా ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదించడంతో స్పందించి ఆర్థిక సాయం విడుదల చేశారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ఈ సందర్భంగా తెలిపారు. ఈ నేపథ్యంలో బాధితులు నారంశెట్టి భవానికి రూ.8 లక్షలు, అట్టాడ రవితేజకు రూ.4 లక్షలు, సిరిపురపు అప్పారావుకు రూ.1.20 లక్షలు, నిరిషా కుమారికి రూ.2 లక్షలు, బూడి శ్రీరాములనాయుడుకు రూ.1.60 లక్షలు చొప్పున చెక్కులు అందజేసినట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, కార్పొరేటర్ నడిపిల్లి ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జాతీయస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు 'మోడల్' విద్యార్థులు



జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న ఎంఈఓలు త్రినాథరావు, పాపారావు

తెర్లాం: జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు తెర్లాం మండలంలోని పెరుమాళి ఏపీ మోడల్ జూనియర్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల ఒంగోలులో జరిగిన రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో జిల్లా తరఫున పాల్గొన్న ప్రశాంత్‌కుమార్, మోహన్‌లు అత్యుత్తమ ఆట తీరు ప్రదర్శించడంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

త్వరలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో కూడా అత్యుత్తమ ఆటతీరు కనబరి మంచి ఫలితాలను సాధించాలని మండల విద్యాశాఖాధికారులు జె.త్రినాథరావు, పాపారావు, పెరుమాళి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతిలక్ష్మి ఈ సందర్భంగా ఆకాంక్షించి అభినందించారు.

అండర్- 14 నార్త్‌జోన్ క్రికెట్ విజేత విశాఖ



టోర్నీ విజేతగా నిలిచిన విశాఖ జట్టుతో సెలక్షన్ కమిటీ చైర్మన్ ఆర్‌వీ నాగరాజన్, సెలెక్టర్ పీఏవీఎన్ రాజు, తదితరులు

- రెండోస్థానంలో నిలిచిన విజయనగరం జట్టు

విజయనగరం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరం జిల్లా కేంద్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అండర్- 14 బాలుర అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీలో విశాఖజిల్లా జట్టు విజేతగా నిలిచింది. విజయనగరం జిల్లా కేంద్రంలోని విజ్జీ స్టేడియం, డెంకాడ మండలం చింతలవలసలో డాక్టర్ పీవీజీ రాజు నార్త్ జోన్ క్రికెట్ మైదానంలో మూడు రోజులపాటు నిర్వహించిన అంతర్ జిల్లాల బాలుర అండర్-14 క్రికెట్ టోర్నీ శుక్రవారంతో ముగిసింది. ఈ టోర్నీలో విజయనగరం, విశాఖ, తూర్పు గోదావరి, శ్రీకాకుళం జిల్లా జట్లు పాల్గొన్నాయి. నార్త్‌జోన్ టోర్నీ విజేతగా నిలిచిన విశాఖ జట్టు తూర్పుగోదావరి, శ్రీకాకుళం, విజయనగరం జట్లపై వరుస విజయాలు సాధించి 12 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. శ్రీకాకుళం, తూర్పుగోదావరి జట్లపై విజయం సాధించి 8 పాయింట్లతో విజయనగరం జట్టు రెండోస్థానంలో నిలిచింది. మూడో స్థానంలో నిలిచిన శ్రీకాకుళం జట్టు, తూర్పు గోదావరి జట్టుపై విజయంతో 4 పాయింట్లు సాధించింది. పోటీలను అండర్-14 బాలుర సెలక్షన్ కమిటీ చైర్మన్ ఆర్‌వీ నాగరాజన్ పరిశీలించారు.

ఏనుగుల విధ్వంసం



ఏనుగులు పాడు చేసిన సోలార్ బోరు



సాలికిరిలో చెరుకు తోటల నుంచి బయటకు వస్తున్న ఏనుగుల గుంపు

భామిని: మండలంలో నాలుగు ఏనుగుల గుంపు విధ్వంసం కొనసాగుతోంది. ఈ క్రమంలో శుక్రవారం సాలికిరికి చెందిన కొత్తకోట ఆంజనేయులు, కొత్తకోట ఖగేశ్వరరావులతో పాటు మరి కొందరు రైతులకు చెందిన చెరుకు తోటలను ధ్వంసం చేశాయి. చెరుకు తోటల్లో తిష్ఠ వేసిన ఏనుగులు కొంత పంటను తినివేసి మిగతా పంటను తొక్కి పాడుచేశాయి. ముందుగా భామిని నుంచి తరలివచ్చిన సమయంలో ఏనుగుల గుంపు రైతు రఘునాథ్ సాంత్రోకు చెందిన సోలార్ బోరును ధ్వంసం చేశాయి. బోరు పైపులను ఏనుగులు బయటకు లాగి పాడు చేసి వాటిలోని నీటిని తాగాయి. ఏనుగుల వల్ల రైతులకు జరిగిన నష్టాలను తక్షణమే గుర్తించాలని బాధితులు కోరుతున్నారు.

వాటర్ ట్యాంక్ పై నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న ఈశ్వర్రావు (ఫైల్)



ఈశ్వర్రావు మృతదేహం



భర్త చేతిలో గాయపడి చికిత్సపొందుతున్న గంగతల్లి

వేపాడ: మండలంలోని బల్లంకి గ్రామానికి చెందిన చెలుబోని ఈశ్వర్రావు (40) శుక్రవారం ఉదయం గ్రామంలోని వాటర్ ట్యాంక్‌పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇందుకు సంబంధించి వల్లంపూడి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చెలుబోను ఈశ్వర్రావును ఏపనికి వెళ్లకపోతే ఎలా? తోట పని ఉంది వెళ్లమని భార్య గంగతల్లి బుధవారం ఉదయం చెప్పడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ఈశ్వర్రావు అదేరోజు రాత్రి భార్యను రాడ్డుతో కొట్టి తల, మెడపై గాయపర్చాడు. గాయాలపాలైన గంగతల్లి వల్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఏఎస్సై బీవీ రమణ కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు. గాయపడిన గంగతల్లి కోటపాడు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం కేజీహెచ్‌కు తరలించడంతో చికిత్స పొందుతోంది. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టడంతో భయపడిన ఈశ్వర్రావు శుక్రవారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తమ్ముడు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు వల్లంపూడి ఏఎస్సై కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట ఆస్పత్రికి తరలించారు. మృతుడు ఈశ్వర్రావుకు భార్య గంగతల్లి, ఇద్దరు పిల్లలు లోకేష్, రేవతి ఉన్నారు.